క్లుప్తంగా

ఆలయానికి గంట సమర్పణ



గంటను అందజేస్తున్న దాత కుటుంబం

సత్యవేడు: పంచాయతీకి చెందిన మట్టెల లక్ష్మీ లోకనాథం దంపతులు వీరభద్రస్వామి ఆలయానికి రూ. 20వేల విలువగల 30 కేజీల గంటను సమర్పించారు. శుక్రవారం ఆలయ ధర్మకర్త రవికుమార్ దేవర్‌కు దీనిని అందజేసి అభిషేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పూజా సమయంలో వినియోగిస్తామని పూజారి తెలిపారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని రైతు భరోసా కేంద్రాలలో రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తున్నట్టు వ్యవసాయాధికారి భారతి తెలిపారు. 10 కేజీల జీలగలు ధర రూ.790 కాగా 50 శాతం రాయితీపై రూ.395లకు, 10 కేజీల జనుములు రూ.840 కాగా రాయితీపై రూ.420లకు, పిల్లిపెసర 10 కేజీలు రూ 970లు కాగా రాయితీపై రూ.485లకు పంపిణీ చేస్తున్నామన్నారు. వీటిని బయోమెట్రిక్ విధానంలో రైతులకు అందజేస్తామన్నారు. జనుము, జీలగలు, పిల్లిపెసర కావలసిన రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకాలు తీసుకురావాలని తెలిపారు. ఎంపీఈఓ రేవతి పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పురపాలక సంఘం కార్యాలయంలో శుక్రవారం ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు జనన మరణ విభాగంలో రికార్డులను పరిశీలించారు. పలు అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కమిషనర్ బాలాజీనాయక్, అధికారులు గజలక్ష్మి, బాబురెడ్డి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బోరుకు ప్లాట్‌ఫాం ఏర్పాటు చేయరూ!



ప్లాట్‌ఫాం లేని చేతిపంపు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో పెద్దపాలేడులోని తాగునీటి చేతి బోరుకు ప్లాట్‌ఫాం లేకపోవటంతో పంపు చుట్టూ అపరిశుభ్రత తాండవిస్తోంది. బురదమయమై దోమలకు ఆవాసమైంది. దీంతో అక్కడ నీటిని తెచ్చుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి ప్లాట్‌ఫాంను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

టైరు పేలి రక్షణ గోడను ఢీకొన్న కారు

తిరుమల : తిరుమల అలిపిరి మొదటి ఘాట్ రోడ్డులో శుక్రవారం ఒక కారు అదుపుతప్పి రక్షణగోడను ఢీకొంది. తిరుపతి ఇస్కాన్ మందిరానికి చెందిన కొందరు తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లారు. తిరిగి కారులో వస్తుండగా మొదటి ఘాట్ రోడ్డులోని మాల్వాడి గుండం మలుపు వద్ద కారు టైరు పేలిపోవడంతో అదుపుతప్పి రక్షణ గోడను ఢీకొని ఆగిపోయింది. ఆ సమయంలో కారులోని బెలూన్లు ఓపెన్ కావడంతో భక్తులు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఇద్దరు భక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న ఘాట్ రోడ్డు భద్రతా సిబ్బంది వాహనాన్ని పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ప్రమాదంపై ట్రాఫిక్ పోలీసులు పరిశీలిస్తున్నారు.

ఈరోజు

అఖిలపక్ష సమావేశం

వరదయ్యపాళెం: ఓటర్ల జాబితా సవరణ విషయమై అన్ని రాజకీయపార్టీలతో శనివారం ఉదయం 11 గంటలకు తమ కార్యాలయంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దారు గౌరీశంకర్‌రావు తెలిపారు. అన్ని రాజకీయపార్టీల నాయకులు పాల్గొని ఓటరు జాబితా సవరణపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయవచ్చన్నారు.

జగనన్న సురక్ష గ్రామసభ

వరదయ్యపాలెం: మండలంలోని కారిపాకం గ్రామ సచివాలయంలో శనివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జగనన్న సురక్ష పథకం గ్రామసభ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యంరాజు తెలిపారు. వలంటీర్లు గుర్తించిన సమస్యలు అక్కడికక్కడే పరిష్కారం చూపుతామని పేర్కొన్నారు. మండల స్థాయి, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

అరణియార్ పర్యాటకానికి పూర్వ వైభవం

- పర్యాటక అభివృద్ధి పనుల పరిశీలనలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



కీళపూడిలో వైద్యశిబిరంలో ఎమ్మెల్యేకు బీపీ చెక్ చేస్తున్న వైద్యురాలు దివ



అరణియార్ వద్ద పర్యాటక పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

పిచ్చాటూరు: అరణియార్ పర్యాటక పనులతో జలాశయానికి పూర్వ వైభవం సంతరించుకోనుందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. తుడా నిధులు రూ.1.82 కోట్లతో చేస్తున్న అరణియార్ పర్యాటక అభివృద్ధి పనులను శుక్రవారం మధ్యాహ్నం ఎమ్మెల్యే పరిశీలించారు. ప్రస్తుతం బేస్‌మెంట్ పూర్తయ్యిందని, ఈ ఏడాది చివరి కల్లా వ్యూ టవర్, బోటింగ్ జట్టీ, చిల్డ్రన్స్ పార్కు పనులు పూర్తి చేస్తామని ఇరిగేషన్ ఈఈ మదన గోపాల్ ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తిరుపతి–చెన్నై జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఈ ప్రాజెక్టు పర్యాటక పనులు పూర్తయితే గొప్ప పర్యాటక కేంద్రంగా అవుతుందన్నారు.

ముత్యాలమ్మ సేవలో ఎమ్మెల్యే

మండలంలోని కీళపూడిలో ప్రారంభమైన ముత్యాలమ్మ కొలుపులో మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్యే పాల్గొని స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలోని నెల్లూరుకు చెందిన వైద్యులు వి.దివ్య, కిషోర్ ఎమ్మెల్యేకు వైద్య పరీక్షలు చేశారు.

జగనన్న సురక్షను విజయవంతం చేద్దాం

అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు సమష్టి కృషితో జగనన్న సురక్ష శిబిరాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. సాయంత్రం కీళపూడిలో జగనన్న సురక్షపై ఎమ్మెల్యే విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 11 రకాల ధ్రువీకరణ పత్రాలలో ప్రజలు కోరిన వాటిని ఇచ్చేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రజల ఇళ్ల వద్దకే ప్రభుత్వ సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ మధుసూదన్ రావు, ఇరిగేషన్ ఏఈ మురళీమోహన్, ఏఓ సంజీవ రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, ఏఎంసీ చైర్‌పర్సన్ సునంద, మాజీ వైస్ ఎంపీపీ పాల పద్మనాభం, ఎంపీటీసీ సభ్యులు శోభన్, సచివాలయ మండల కన్వీనర్ తొప్పయ్య, విద్యార్థి విభాగ రాష్ట్ర కార్యదర్శి గజేంద్ర, నాయకులు చలపతిరాజు, మోహన్, చెంగల్రాయ రెడ్డి, బాబు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

బుచ్చినాయుడుకండ్రిగ: బుచ్చినాయుడుకండ్రిగలో జరగనున్న పలు కార్యక్రమాల్లో శనివారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొంటారని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ అరణివిద్యానాథరెడ్డి తెలిపారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో అమ్మఒడి డిజిటల్ చెక్కు పంపిణీ, గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొనడంతోపాటు ఇంటర్ బాలికల కోసం హాస్టల్‌ను ప్రారంభిస్తారని తెలియజేశారు.

కుష్ఠు నిర్ధారణకు స్వీయ పరీక్షలు ఉత్తమం

- డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి



తారకరామానగర్‌లో పరిసరాలను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి

రేణిగుంట: కుష్ఠు వ్యాధిని గుర్తించేందుకు స్వీయ పరీక్షలు ఉత్తమమని జిల్లా డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ సుధారాణి అన్నారు. జూన్ 26 నుంచి జూలై 16వ తేదీ వరకు కుష్ఠు వ్యాధిపై అవగాహన, వ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించే కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం కరకంబాడి పంచాయతీ తారక రామానగర్‌లో ఎస్‌సీడీసీ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. వ్యాధి కారక సూక్ష్మజీవి, వ్యాధి లక్షణాలు, వాటిని ఎలా గుర్తించాలో తెలియజేశారు. అనుమానిత లక్షణాలతో ఉన్న వారిని గుర్తించి ఆశా వర్కర్లు పీహెచ్‌సీకి రెఫర్ చేయాలని ఆదేశించారు. వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయితే నివారణకు ప్రభుత్వం ఖరీదైన మందులను పీహెచ్‌సీలలో ఇస్తోందని, వైద్యుల పర్యవేక్షణలో క్రమం తప్పకుండా వాడితే వ్యాధి నుంచి విముక్తి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ రామకృష్ణ, సూపర్‌వైజర్ కామరాజు, ఏఎన్‌ఎం జయలక్ష్మి పాల్గొన్నారు.

సంక్షేమమే సీఎం ఎజెండా

- ప్రభుత్వ పథకాలతో మారిన బతుకులు
- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



లబ్ధిదారులకు బుక్‌లెట్ ఇస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

కేవీబీపురం : ప్రజా సంక్షేమమే జగనన్న ఎజెండా అని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మండలంలోని కాళంగిలో శుక్రవారం ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఆయా కుటుంబాలు పొందిన సంక్షేమ పథకాల లబ్ధిని బుక్‌లెట్లతో వివరించారు. తాగునీటి వసతి కల్పించాలని, పంట కాలువలు తీయాలని, మురుగు కాలువలు నిర్మించాలని, వీధి కొళాయిలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు నివేదించారు. స్థానిక సమస్యలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఇదలా ఉంచితే, గత వారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తన దృష్టికి వచ్చిన సమస్యలను ఏమేరకు పరిష్కరించారో అధికారులతో ఎమ్మెల్యే సమీక్షించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గవర్ల కృష్ణయ్య, ఎంపీపీ మునిలక్ష్మి, జెడ్పీటీసీ మునెమ్మ, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు బొర్రా మాధవి, పార్టీ ముఖ్యనేతలు నందకుమార్, లాల్‌బాబు యాదవ్, హరిబాబు, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలపై వివక్ష నేరం



సమావేశంలో మాట్లాడుతున్న డీటీ శివయ్య

బుచ్చినాయుడుకండ్రిగ: ఎస్సీ, ఎస్టీలపై ఇతర కులస్తులు వివక్ష చూపితే చట్టరీత్యా చర్యలు తప్పవని డిప్యూటీ తహసీల్దారు శివయ్య హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని కుక్కంబాకం గ్రామ పంచాయతీ తానిగిల్లు ఎస్టీ కాలనీలో సామాజిక న్యాయంపై రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు, పోలీసు శాఖ ఆధ్వర్యంలో గిరిజనులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం కల్పిస్తున్న హక్కులపై ఎస్సీ, ఎస్టీలు అవగాహన కలిగి ఉండాలన్నారు. అగ్రవర్ణాల వారు ఎస్సీ, ఎస్టీలను చిన్న చూపు చూడరాదన్నారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వ పథకాల ఫలాలు అందకపోయినా, వివక్షకు గురైనా తమ దృష్టికి తెస్తే న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఓ త్రివిక్రమ్‌రావు, ఆర్‌ఐ వెంకటసుబ్బయ్య, పోలీసు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

వరదయ్యపాళెం: డాక్టర్స్‌డే పురస్కరించుకుని జూలై 1న ఎస్ఎల్ హాస్పిటల్ వద్ద ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు డాక్టర్ లోకేశ్వరి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సాధారణ వ్యాధులకు వైద్యపరీక్షలు చేయడంతోపాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. మండల ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గోవిందుడి జ్యేష్ఠాభిషేకం

తిరుపతి కల్చరల్: గోవిందరాజస్వామి ఆలయంలో శుక్రవారం జ్యేష్ఠాభిషేకం వేడుకగా ప్రారంభమైంది. తొలుత ఉదయం సుప్రభాతసేవతో స్వామిని మేల్కొలిపి కైంకర్యాలు చేశారు. శతకలశ స్నపనం, మహా శాంతి హోమం చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి ఉత్సవమూర్తులను కల్యాణ మండపానికి వేంచేపు చేసి స్నపన తిరుమంజనం నిర్వహించారు. పంచామృతంతో అభిషేకించారు. ఆ తర్వాతస్వామి వారి కవచాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి కవచాధివాసం చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి వారు తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు.

విద్యార్థినులకు ప్రశంసా పత్రాలు



ఎన్ఎస్ఎస్ పీఓ రేణుకమ్మను సన్మానిస్తున్న బ్రహ్మకుమారీస్ సిస్టర్ రమణి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): శ్రీ ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో తొట్టంబేడు ఎస్వీఏ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు తొలిసారి దేవతామూర్తుల వేషధారణలో ప్రదర్శనలు ఇచ్చారు. బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు వరుసగా నవదుర్గలు, అష్టలక్ష్ములు, లక్ష్మీనారాయణులు, రాధాకృష్ణులు, గోపికలుగా వేషధారణలతో ఆకట్టుకున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కళాశాలలో బ్రహ్మకుమారీస్ రమణి సిస్టర్ ఆధ్వర్యంలో విద్యార్థినులను అభినందించి వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్ మాట్లాడుతూ, విద్యార్థినులు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడమే కాకుండా దైవ సంబంధిత కార్యక్రమాల్లో తొలిసారి పాల్గొని అందరినీ మెప్పించడం ఆనందంగా ఉందన్నారు. దీనికి చొరవ చూపి, విద్యార్థినులతో ప్రదర్శనలు ఇప్పించి, కళాశాలకు పేరు తెచ్చారంటూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కేసీ.రేణుకమ్మను అభినందించారు. ఆమెను శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు బాబు, సత్యమూర్తి, శ్రీహరి రెడ్డి, ఉదయలక్ష్మి, సునీల్‌కుమారి, టి.శైలజ, వి.శైలజ, విద్యార్థినులు పాల్గొన్నారు.

'అమరరాజ'కు అవార్డు



అవార్డును అందుకుంటున్న అమరరాజ కంపెనీ ప్రతినిధులు

రేణిగుంట: మండలంలోని కరకంబాడి అమరరాజ బ్యాటరీస్ కర్మాగారానికి 2023వ సంవత్సరానికి గాను 'ద గ్రేట్ ప్లేస్ టు వర్క్' సంస్థ నిర్వహించిన అధ్యయనం ప్రకారం దేశ స్థాయిలో 78వ ర్యాంకును సొంతం చేసుకుంది. దేశ వాణిజ్య రాజధాని ముంబైలో శుక్రవారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో కంపెనీ ప్రతినిధులు ప్రెసిడెంట్ గ్రూప్ ఆఫ్ హెచ్ఆర్ జైకృష్ణ, ద్వారకనాథ్, హరిమోహన్‌రెడ్డి, నిరంజన్, నాగరాజ్, శేఖర్ జగన్నాధన్, రాజేశ్వర్ అవార్డును అందుకున్నారు. అమరరాజ గ్రూప్ చైర్మన్ గల్లా జయదేవ్ మాట్లాడుతూ, ఉద్యోగులే చోదకశక్తి అని బలంగా నమ్మి సంస్థలోని ప్రతి వ్యక్తి పూర్తి సామర్థ్యాన్ని చేరుకోవడానికి తగిన వనరులు, పరిస్థితులను సంస్థ కల్పిస్తోందన్నారు. ఇలాంటి అవార్డులు ఉద్యోగుల్లో మరింతగా ఆత్మస్థైర్యాన్ని నింపి వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులను అందించే దిశగా కృషి చేసేందుకు దోహదం చేస్తాయన్నారు.

వేడుకగా ముత్యాలమ్మ కొలుపు



అన్నదానం చేస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ సునంద దంపతులు

పిచ్చాటూరు: మండలంలోని కీళపూడిలో ముత్యాలమ్మ కొలుపు శుక్రవారం ప్రారంభమైంది. తొలిరోజు ఉదయం స్వామి, అమ్మవార్ల మూల విరాట్‌కు ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. వివిధ రకాల పుష్పాలతో విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మధ్యాహ్నం ఏఎంసీ చైర్‌పర్సన్ సునంద దంపతులు ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త పద్మనాభం మాట్లాడుతూ, శనివారం ముత్యాలయ్య, ముత్యాలమ్మ ఉత్సవమూర్తుల గ్రామో త్సవం, ఆదివారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో భక్తుల అగ్నిగుండ ప్రవేశం నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

పాడి రైతులకు బ్యాంకు రుణాలు





సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కుమార్, బ్రాహ్మణ తాంగాళ్‌లో నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరం

నారాయణవనం: జగనన్న పాలవెల్లువ పథకంలో భాగంగా పాడి రైతులకు బర్రెలు, ఆవుల కొనుగోలుకు బ్యాంకు రుణాలు ఇస్తామని పశువైద్యాధికారులు కుమార్, భార్గవి తెలిపారు. శుక్రవారం మండలంలోని ఎరికంబట్టు దళితవాడ, బ్రాహ్మణ తాంగాళ్‌లో పాడి రైతులకు సమావేశాలు, పశువైద్య శిబిరాలను నిర్వహించారు. వారు మాట్లాడుతూ, ఆవులు, బర్రెల కోసం డీసీసీబీ బ్యాంకు, రాష్ట్ర సహకార బ్యాంకుల ద్వారా వ్యక్తిగత రుణాలకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. జగనన్న పాలవెల్లువ పథకంతో అముల్ డెయిరీకి పాలను సరఫరా చేసి ఆదాయం గడించాలని సూచించారు. పశువులు అనారోగ్యానికి గురైన పక్షంలో సమాచారమిస్తే వెంటనే వైద్య సేవలు అందిస్తామని, అవసరమైతే శస్త్రచికిత్స చేస్తామన్నారు. పాడి వృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న ఉచిత సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వారు అన్నారు. వైద్య శిబిరంలో పిడుదులు, నట్టల నివారణ మందులను ఆవులు, దూడలకు పిచికారీ చేశారు.

పూరిల్లు దగ్ధం

- బూడిదైన డ్వాక్రా రుణం సొమ్ము



కాలుతున్న పూరిల్లు

పిచ్చాటూరు : మండలంలోని తులసికృష్ణాపురం యానాది కాలనీలో శుక్రవారం సంభవించిన అగ్నిప్రమాదంలో ఓ పూరిల్లు దగ్ధమైంది. వివరాలు.. మాతమ్మ, సురేష్ దంపతులు ఇంట్లో ఉండగా మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు రాజుకున్నాయి. చుట్టుపక్కలవారితో కలిసి మంటలు ఆర్పేందుకు విఫలయత్నం చేసినా ఇల్లు పూర్తిగా కాలిపోయింది. బాధితురాలు మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపు ద్వారా బ్యాంకు నుంచి రూ.1.90 లక్షల రుణం తీసుకున్నామని, ఆ సొమ్మును ఇంట్లోనే ఉంచగా ప్రమాదంలో బూడిదగా మారిందని విలపించింది. అలాగే ఇంటితోపాటు కాలిపోయిన వస్తువులు, దుస్తులు, బంగారం విలువ సుమారు రూ.2.50 లక్షలు ఉంటుందని ఆవేదన వ్యక్తం చేసింది. ఇల్లు కూడా పోయి వీధిన పడిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని విన్నవించింది.

'జగనన్న సురక్ష'తో అర్హులందరికీ సంక్షేమం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ నరసింహరావు

బుచ్చినాయుడుకండ్రిగ: అర్హత ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని వారికి సైతం లబ్ధి చేకూర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అతిపెద్ద ప్రాయోజిత కార్యక్రమం జగనన్న సురక్ష అని, అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని ఎంపీడీఓ నరసింహారావు అన్నారు. శుక్రవారం జగనన్న సురక్ష పథకంపై మండలంలోని పుత్తేరి, వీయస్‌పురం గ్రామాల్లో ఆయన గ్రామసభ నిర్వహించి మాట్లాడారు. జూలై 1 నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు జగనన్న సురక్షను మండలంలోని 14 సచివాలయాల పరిధిలో ప్రణాళికాబద్ధంగా అమలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటినీ సందర్శించి, జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఏ సేవలను ఉచితంగా అందిస్తారో అవగాహన కల్పించాలన్నారు. క్యాంపు నిర్వహించే రోజున 11 రకాల ప్రభుత్వ సేవలను సేవా రుసుం లేకుండా ఉచితంగా అందుతుందన్నారు. దీనిని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ భాస్కర్, ఎంఎల్ఓ ప్రసాద్, మణి నాయుడు, సర్పంచ్ సిద్ధమ్మ తదితరులు పాల్గొన్నారు.

గడ్డర్ల ఏర్పాటుకు ట్రయల్ రన్



పూజ చేస్తున్న కమిషనర్, డిప్యూటీ మేయర్

తిరుపతి తుడా: తిరుపతి స్మార్ట్ సిటీలో భాగంగా నిర్మిస్తున్న శ్రీనివాస సేతు వంతెన పనులు తుది దశకు చేరుకున్నాయి. రామానుజ సర్కిల్ నుంచి ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లే రోడ్డులోని రైల్వే లైన్‌పై ఐరన్ గడ్డర్లను అమర్చే ప్రకియకు శుక్రవారం ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ పనులను తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, రైల్వే అధికారులు పూజలు చేసి ప్రారంభించారు. కమిషనర్, డిప్యూటీ మేయర్ మాట్లాడారు. వంతెనను అనుసంధానం చేసే ప్రక్రియలో అతి భారీ ఆరు ఐరన్ గడ్డర్లను ఏర్పాటు చేయడంతో దాదాపు శ్రీనివాస సేతు నిర్మాణం పూర్తవుతుందన్నారు. రైల్వే అధికారులు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 వరకు పనులు చేయడానికి అనుమతి ఇచ్చారని, ఆరు గడ్డర్లు అమర్చేందుకు ఎంత సమయం పడుతుందనే దానిపై అంచనాకు వచ్చినట్టు చెప్పారు. శనివారం నుంచి పనులను వేగవంతం చేసి మరో పది రోజుల లోపు పూర్తి చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్ఈ మోహన్, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, తిరుపతి రైల్వే స్టేషన్ అధికారులు కుప్పాల సత్యనారాయణ, కృష్ణ, సుబ్బారావు, ఆప్కాన్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

భక్తుల సహకారంతో ఆలయాభివృద్ధి

నగరి: టీటీడీ ఆధీనంలో ఉన్న నగరి శ్రీకరియమాణిక్య స్వామి ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకురావాలని స్థానిక ఆలయాల అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థసారథి అన్నారు. శుక్రవారం ఆలయానికి వచ్చిన ఆయన ఆలయంలో జరిగే నిత్య కైంకర్యాలు, పోటు, ఇతర అభివృద్ధి పనులు తనిఖీ చేశారు. స్థానిక భక్తులు ఆయన్ను కలిసి చాలా కాలంగా ఎదురు చూస్తున్న ఊంజల్ సేవను త్వరగా ప్రారంభించాలని, బ్రహ్మోత్సవాలు నిర్వహించాలని కోరారు. దీనిపై ఏఈఓ మాట్లాడుతూ.. ఉన్నతాధికారులతో మాట్లాడి ఆగస్టు మొదటి వారంలో ఊంజల్ సేవ నిర్వహిస్తామని, దాతల సహకారంతో బ్రహ్మోత్సవాలను నిర్వహించేందుకు ఉన్నతాధికారులతో చర్చిస్తామన్నారు. ప్రస్తుతం ప్రతి శనివారం మధ్యాహ్నం స్థానిక దాతల సహకారంతో జరిగే అన్నదాన కార్యక్రమాన్ని నిర్విరామంగా కొనసాగించాలన్నారు. స్థానిక ఆలయాల సూపరింటెండెంట్ రమేష్, ఆలయ అధికారి వెంకటరమణ, ప్రధానార్చకులు ధన్వంతరి ఆచార్యులు, రాంప్రసాద్ ఆచార్యులు ఉన్నారు.